సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



రెచ్చిపోతున్న కేబుల్ దొంగలు

వ్యవసాయ బోర్లకు అమర్చిన కేబుళ్లను దొంగలు చోరీ చేసి ఎత్తుకెళుతున్నారు. ఒకేసారి 160 బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు కత్తిరించుకుని వెళ్లారు. -8లో



ఘనంగా దర్గా స్వామిజీ ఆరాధన

రామాపురం మండలం నీలకంట్రావుపేట సమీపంలో వెలసిన శ్రీ దర్బారు సమర్థ సద్గురు దర్గా స్వామిజీ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.110	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 119 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	410	480
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 2007.580 కిలోలు

న్యూస్‌రీల్

జపాన్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక



ఇంటర్న్‌షిప్‌కు వెళ్లిన మిట్స్ విద్యార్థులు

కురబలకోట: జపాన్‌లోని ఐజు యూనివర్సిటిలో ఇంటర్న్‌షిప్ చేయడానికి అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం విద్యార్థులు చరన్‌తేజ్, హరీష్‌కుమార్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. మూడు నెలలపాటు వీరు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లర్నింగ్‌పై పరిశోధనలు చేస్తారన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ



ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

సంబేపల్లి: సంబేపల్లె మండలంలోని దుద్యాల గ్రామ ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా గణాంకాధికారి ఓబుల్‌రెడ్డి, ఆర్‌సీహెచ్ డీపీ మునీశ్వర్లు రికార్డులను పరిశీలించారు. ఉప కేంద్ర పరిధి గ్రామంలో అందుతున్న వైద్య సేవలు, 104 సేవలను, వ్యాక్సినేషన్, బాలింతలు, ప్రధాన మంత్రి మాతృ యోజన, ప్రసవాలు తదితర కార్యక్రమాల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ బలరాంరాజు, సుగుణ, సీహెచ్‌ఓ, డీఈఎస్ రాణి, పీహెచ్‌ఎన్ పూర్ణమ్మ, ఒకటో హెల్త్ సూపర్ వైజర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో మెరుగైన వైద్యం



ప్రజలకు అందుతున్న వైద్యాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

చిన్నమండెం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలు కలుగుతోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నమండెం-2 సచివాలయంలో సర్పంచ్‌లు అమీరాబీ, పుల్లమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని ఆయన సందర్శించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో అందుతున్న వైద్యసేవల గురించి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సునీతారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏజాస్‌అలీఖాన్, ఎంపీటీసీ రమేష్, ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, ఏఓ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి రెడ్డికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోల్ బ్యాక్!

- తిరిగి నందలూరులో రైల్వే రన్నింగ్‌రూం
- బడ్జెట్ పింక్ బుక్‌లో మంజూరు చేస్తూ ప్రకటన
- రూ.3.32 కోట్ల వ్యయంతో నిర్మాణం





రన్నింగ్‌రూంకు అనుకూలంగా భావిస్తున్న బ్రిటీషు కాలం నాటి లోకోఫోర్‌మెన్ కార్యాలయం ప్రాంతం

రాజంపేట: ఒకప్పుడు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు కేంద్రానికి వందపడకల రైల్వే రన్నింగ్‌రూం నిర్మాణం తరలిపోయిన నేపథ్యంలో తిరిగి అదే స్థానంలో రోల్‌బ్యాక్ రూపంలో న్యూ రన్నింగ్ రూంను రైల్వేశాఖ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ విడుదల చేసిన బడ్జెట్ పింక్‌బుక్‌లో నందలూరు న్యూ రన్నింగ్ రూం నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం రూ.3.32 కోట్లు మంజూరు చేశారు. దీంతో నందలూరు ప్రాంతీయుల వాసులు ఆశలు మళ్లీ చిగురించాయి. బ్రిటీషుకాలం నుంచి జిల్లాలో ఎక్కడాలేని విధంగా నందలూరు రైల్వే కేంద్రంలో సమృద్ధిగా వనరులు ఉన్నాయి. రైల్వేపరంగా బ్రిటిష్ పాలకులు వినియోగించుకున్నప్పటికీ.. ఇప్పటి డివిజన్ ఉన్నతాధికారులు శీతకన్ను వేసినా రైల్వేబోర్డు, రైల్వేమంత్రిత్వశాఖ నందలూరు ప్రాముఖ్యతను గుర్తించింది.

అటకెక్కిన వందపడకల రన్నింగ్‌రూం

2017లో నందలూరులో ఇండియన్ రైల్వేలో ఎక్కడా లేని విధంగా వందపడకల రన్నింగ్‌రూంకు రైల్వేశాఖ కసరత్తు చేసింది. సెంట్రలైజ్డ్ ఏసీతో నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఉన్నతాధికారులు నందలూరులో పరిశీలించి వెళ్లారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో రైల్వే రన్నింగ్‌రూం నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. కొంతమంది రైల్వే అధికారులు ఉద్దేశపూర్వకంగా ఎర్రగుంట్లలో రన్నింగ్ రూంను ఏర్పాటుచేసే క్రమంలో ఈ నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేశారు. ఎర్రగుంట్ల రైల్వే క్రూ సెంటర్ నిర్వహణ విఫలమైన సంగతి తెలిసిందే. అక్కడ విధులు చేయడానికి లోకో పైలెట్స్ 80శాతం మంది ప్రతికూలతను వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడు నందలూరు క్రూసెంటర్ ప్రాముఖ్యతను తెలుసుకున్న అధికారులు నాలుక కరుచుకుంటున్నారు.

- గతంలో వందపడకల ప్రతిపాదనను కొనసాగించేలా రైల్వే రన్నింగ్‌రూం నిర్మించాలనే డిమాండ్ రైల్వే వర్గాల నుంచి వినిపిస్తోంది. దీనివల్ల చెన్నై నుంచి ముంబై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, వివిధ గూడ్స్‌రైళ్లకు సంబంధించిన డ్రైవర్లు, గార్డులు విధి నిర్వహణలో సేద తీరేందుకు దోహదపడుతుంది. ఈమార్గంలో నడిచే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌తో పాటు క్రూ సౌకర్యం కలుగుతుందని రైల్వేవర్గాలు భావిస్తున్నాయి. చెన్నై, రేణిగుంట, అటు గుంతకల్, గుత్తి, ఎర్రగుంట్ల, డోన్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే రన్నింగ్‌స్టాఫ్‌కు నిబంధనల మేరకు రెస్ట్ లభిస్తుందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.
- బ్రిటీషు రైల్వేపాలకుల హయాంలో ఉన్న లోకోషెడ్ ఫోర్‌మెన్ కార్యాలయం, సమీప ప్రదేశం ఖాళీగా ఉంది. ఈ ప్రదేశం న్యూ రన్నింగ్‌రూంకు అనుకూలమని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి. దగ్గరలో రైల్వే హాస్పిటల్, పాతరన్నింగ్ రూం ఉన్నాయి. అలాగే ప్లాట్‌ఫాం.. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఫోర్‌మెన్ కార్యాలయం వరకు పొడిగిస్తే నేరుగా లోకోపైలెట్స్, గార్డులు, అసిస్టెంట్ లోకోపైలెట్స్ రన్నింగ్‌క్రూ సెంటర్‌కు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుందని లోకోపైలెట్స్ అంటున్నారు. ఆ దిశగా రైల్వే ఇంజినీర్లు పరిశీలించాలని రైల్వేకార్మికసంఘాలు కోరుతున్నాయి.

ఫలించిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కృషి

నందలూరు రైల్వేకేంద్రంపై లోక్‌సభలో తొలిసారి గళం విప్పింది పీవీ మిథున్‌రెడ్డి అని చెబుతుంటారు. రైల్వేమంత్రిత్వశాఖ, రైల్వే బోర్డు చైర్మన్లను స్వయంగా కలిసి అనేక మార్లు నందలూరు రైల్వే ప్రాముఖ్యతను, ఇక్కడ రెడీమేడ్‌గా ఉన్న వనరుల గురించి వివరించారు.రన్నింగ్ స్టాఫ్ క్రూసెంటర్ బలోపేతం, వివిధ రైళ్లకు వాటరింగ్‌తోపాటు పలు విభాగాలను ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉందని తెలియజేస్తూ వచ్చారు. ఇక్కడ మంజూరైన వందపడకల రన్నింగ్‌రూం తరలిపోయిన స్థానంలో న్యూ రన్నింగ్ రూం మంజూరు కావడం వెనుక రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కృషి ఉందని నందలూరు వాసులు చెబుతున్నారు.

సంతోషంగా ఉంది



కేంద్రం విడుదల చేసిన మధ్యంతర బడ్జెట్‌లో నందలూరుకు రన్నింగ్‌రూం మంజూరు చేయడం సంతోషంగా ఉంది. రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ బలోపేతం కావడానికి రైల్వేబోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం శుభసూచకం. నందలూరు కోసం తన వంతు బాధ్యతగా ఎంపీ మిథున్‌రెడ్డి కృషి అభినందనీయమం. ఒకప్పుడు రైల్వేకార్మికులతో కళకళలాడిన పరిస్థితులు తిరిగి రావాలని ఎదురుచూస్తున్నాం.

-కమాల్‌బాషా, రిటైర్డ్ రైల్వే డ్రైవర్, నందలూరు

ఘన చరిత్రను చేరిపేయలేరు



రైల్వేపరంగా నందలూరుకు ఘనచరిత్ర ఉంది. దీనిని ఎవరూ చెరిపివేయలేరు. లోకోషెడ్ ఎత్తేసిన తర్వాత నందలూరును ఏదో విధంగా నిర్వీర్యం చేయడానికి ప్రతిపాదనలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. అయితే రైల్వేమంత్రిత్వ శాఖ, రైల్వేబోర్డు నందలూరు రైల్వే ప్రాముఖ్యతను గుర్తించి, తిరిగి న్యూ రన్నింగ్‌రూంను మంజూరు చేశారు. అలాగే నందలూరు రైల్వేకేంద్రం పూర్వవైభవంను సంతరించుకునేలా చర్యలు తీసుకోవాలి.

-జీవీ రమణయాదవ్, రైల్వే కార్మికకుటుంబం, గొల్లపల్లె, నందలూరు

పూర్వవైభవం కోసం ఎంపీ మిథున్‌రెడ్డి కృషి



నందలూరుకు పూర్వవైభవంగా కోసం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కృషిచేస్తున్నారు. అనేక మార్లు రైల్వేబోర్డు, రైల్లే మంత్రిత్వశాఖలను సంప్రదిస్తూ దీని ప్రాముఖ్యతను తెలియచేస్తూ వచ్చారు. ఇప్పటికైనా రైల్వే మంత్రిత్వశాఖ నందలూరును గుర్తించింది. న్యూ రన్నింగ్‌రూంను మంజూరు చేసింది. రెండు దశాబ్దాల కిందట ఇక్కడ రైల్వే ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేయాలని తాము చేసిన ఉద్యమం దేశరాజధానికి వెళ్లిందని గుర్తుచేశారు.

-ఆర్ముగం విశ్వనాథ్, రైల్వే ఉద్యమనేత, నందలూరు

దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఎంపిక



కట్టా సుబ్బయ్య

లక్కిరెడ్డిపల్లి: రాజస్థాన్‌లో ఈనెల 10 నుంచి 11వ తేదీ వరకు జరిగే దివ్యాంగుల నేషనల్ డిసేబుల్ క్రికెట్‌కు లక్కిరెడ్డిపల్లెకు చెందిన దివ్యాంగుడు కట్టా సుబ్బయ్య ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఇండియన్ కెప్టెన్ వసంత్ కుమార్ తెలియజేశారని సుబ్బయ్య చెప్పారు. ఏడాది క్రితం కడపలో జరిగిన జిల్లా దివ్యాంగుల క్రికెట్ పోటీలకు సుబ్బయ్య ఎంపికయ్యారు. అనంతరం ఆగస్టులో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు విశాఖపట్నంలో జరిగాయి. ఇందులో బౌలింగ్, బ్యాటింగ్‌లో సుబ్బయ్య రాణించి నేషనల్ క్రికెట్‌కు ఎంపికయ్యారు. రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొనాలని వసంత్ నుంచి సమాచారం అందిందని సుబ్బయ్య తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యువతకు అందిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సూరిబాబు సూచించారు. శుక్రవారం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో టీవీ టెక్నీషియన్స్‌కు రెండు రోజుల పాటు అప్ స్కిల్లింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. జిల్లాలోని టీవీ టెక్నీషియన్స్‌కు రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్(ఆర్‌పీఎల్) పథకం కింద మార్గదర్శక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. టీవీ సాంకేతిక నిపుణులకు కొత్త సాంకేతికతలలో అత్యాధునిక శిక్షణను అందించడంపై దృష్టి సారించామన్నారు. యువత కూడా కొత్త టెక్నాలజీపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 120 మంది టీవీ టెక్నీషియన్స్‌కు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.స్థానికంగా శిక్షణ పొందిన వారికి ఢిల్లీలోని ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ద్వారా అసెస్‌మెంట్ కార్యక్రమా న్ని నిర్వహించి సర్టిఫికెట్లను ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 1 నుంచి మార్చి 20వ తేదీ వరకు జిల్లాలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై ఇంటర్మీడియట్ విద్య, ఏపీఎస్ఆర్టీసీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారుల సమన్వయ కమిటీతో సమావేశాన్ని జేసీ నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో చిన్నపాటి లోపం కూడా తలెత్తరాదని అధికారులకు సూచించారు. జిల్లా పరిధిలో జరగనున్న ఇంటర్ పరీక్షల వివరాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 29833 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని,. వీరిలో 14731 మంది మొదటి సంవత్సరం, 15102 మంది రెండవ సంవత్సరం పరీక్షలు రాయబోతున్నారని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి ఈనెల 20వ తేది వరకు నిర్వహిస్తామన్నారు. పర్యావరణానికి సంబంధించిన పరీక్షను ఈ నెల 3వ తేదీ నుంచి 23వ తేదికి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలను ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు గంట ముందు చేరుకునేలా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైద్య, ఎస్పీడీసీఎల్ తదితర శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు.

ఓటరు జాబితా పెండింగ్ ఫారాలను పరిష్కరిస్తాం

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రచురణ అనంతరం అందిన ఫారాలను పక్కాగా పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం విజయవాడలోని ఎలక్షన్ కమీషన్ కార్యాలయం నుంచి 2004 తుది జాబితాలో మార్పులు, చేర్పులు, దరఖాస్తుల పరిష్కారం, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల నిర్వహణ ఖర్చు తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజకమల్‌లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024 తుది ఓటరు జాబితా ప్రచురించిన పిదప రాజకీయ పార్టీలు, ఇతరుల నుంచి అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు. ఇంకా 16500 దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉందన్నారు. వీటిని పూర్తిగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని వివరించారు. అలాగే తుది జాబితాపై 604 చేర్పులు, 189 తొలగింపులకు విజ్ఞప్తులు వచ్చాయన్నారు. వీటిని కూడా పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో 18-19 సంవత్సరాల యువత 31700 మందిని నమోదు చేశామన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో వందశాతం కనీస సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు.జిల్లాలో సమస్యాత్మక, షాడో జోన్ పరిధిలోకి వచ్చే పోలింగ్ గుర్తింపు కూడా చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ జిల్లాలో అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేసి అందిన అన్ని ఫామ్‌లను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. వీసీఓ డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎస్డీసీ శ్రీలేఖ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అయోమయం!

- బాబు ష్యూరిటీ ఓకే... భవిష్యత్‌కులేదు క్లారిటీ
- ఇన్‌చార్జీలకు తెలియకుండానే ఆశావహుల చేరిక
- ఎవరు ఎక్కడ పోటీ చేస్తారో తెలియని పరిస్థితి
- తెలుగుతమ్ముళ్లలో అయోమయం



సాక్షి ప్రతినిధి, కడప: గడప గడపకు ప్రభుత్వం పేరిట వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ఇల్లిల్లు తిరిగారు. వైఎస్సార్ ఆసరా పేరిట అక్కచెల్లెమ్మలను పలకరిస్తున్నారు. దీంతోపాటు నిత్యం ఏదో ఒక కార్యక్రమం చేపడుతూ ప్రజల మధ్యనే ఉంటున్నారు. ఐదేళ్ల ప్రభుత్వ పాలన ఆధారంగా ఓట్లు వేయాలని ధైర్యంగా కోరుతున్నారు. ఇలాంటి తరుణంలో జిల్లాలోని టీడీపీలో అయోమయం నెలకొంది. ఇన్‌చార్జీలకు అసలు సీటు ఉందో లేదో తెలియదు.అయినా కొందరు ఇన్‌చార్జీకి తెలియకుండానే చంద్రబాబు సమక్షంలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో బాబు ష్యూరిటీ సరే, మా భవిష్యత్‌కు లేదు క్లారిటీ అంటూ పలువురు నేతలు మదనపడుతున్నారు.

- తెలుగుదేశంపార్టీలో జెండా మోసినోళ్ల కంటే ధనవంతులకే ప్రాధాన్యత లభిస్తోంది. ఎక్కడ తూకం ఎక్కువ ఉంటే అటువైపు అధినేత మొగ్గ చూపే పరిస్థితి కన్పిస్తోంది. ఈక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జీకి తెలియకుండానే, చంద్రబాబు సమక్షంలో ఎమ్మెల్యే టికెట్ ఆశావహులు పార్టీలో చేరుతున్నారు. ఐదేళ్లుగా ఇన్‌చార్జీగా ఉన్న నేతల కంటే ఇటీవల పార్టీలో చేరిన నాయకులు టికెట్ హామీతోనే పార్టీలో చేరినట్లు వారి అనుచరుల వద్ద చెప్పుకుంటున్నారు. మరోవైపు తెరవెనుక మంత్రాంగం నిర్వహిస్తూ వర్గ సమీకరణకు పాల్పడుతుండటంతో వారి మాటలకు మరింత బలం చేకూరుతోందని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.
- మాజీ ఎమ్మెల్యేలు వీరశివారెడ్డి, ద్వారకనాథరెడ్డిలు ఇటీవల టీడీపీలో చేరారు. ఇద్దరు కూడా ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జీలు పుత్తా నరసింహారెడ్డి, ఆర్ రమేష్‌కుమార్‌రెడ్డి ప్రమేయం లేకుండానే అధినేత వద్ద పచ్చ కండువా కప్పుకున్నారు. తర్వాత నియోజకవర్గాల్లోకి వచ్చిన వారిద్దరు అనుచరులతో టికెట్ తమకే వస్తుందనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఆనక తెరవెనుక మంత్రాంగం నిర్వహిస్తూ వర్గ సమీకరణ చేస్తున్నట్లు సమాచారం. వరుసగా మూడు సార్లు ఓడిపోయిన నేతలకు టికెట్ ఇచ్చేది లేదని, ఇదివరకే నారాలోకేష్ ఒంగోలులో పార్టీ సమావేశంలో ప్రకటించారు. ఇవన్నీ బేరీజు వేసుకుంటూ తమకే టికెట్ దక్కుతుందనే ధీమాను మాజీ ఎమ్మెల్యేలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఆ రెండు చోట్లనే కాకుండా కడప, ప్రొద్దుటూరులో ఎవరికి వారు తామే అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటూ అధిష్టానం ప్రకటనతో నిమిత్తం లేకుండా పోస్టర్లు కూడా వేసుకున్నారు. రైల్వేకోడూరు, రాజంపేట, బద్వేల్‌లో 2019లో పోటీ చేసిన నేతలతో నిమిత్తం లేకుండా కొత్తవారి పట్ల మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో తెలుగుతమ్ముళ్ల మధ్య గందరగోళం నెలకొంది.

వైఎస్సార్‌సీపీకి అపార మద్దతు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా.. వైఎస్సార్‌సీపీకి అపార ప్రజామద్దతు ఉన్న ప్రాంతం. నలుదిశలా విశేష అభివృద్ధి చోటు చేసుకుంది. మరోవైపు ఐదేళ్ల పాలనలో మీకు మంచి చేసి ఉంటే ఓటెయ్యండని వైఎస్సార్‌సీపీ ప్రజలను కోరుతోంది. దమ్ము..ధైర్యం ప్రకటిస్తున్న అధికార పార్టీని ఢీ కొనడం ఎలా అన్న సందిగ్ధత ఆయా పార్టీల ఆశావహులను వెంటాడుతోంది. కనీసం అభ్యర్థిత్వంపై క్లారిటీ ఇస్తే ప్రజల మధ్యకు వెళ్లి వ్యక్తిగతంగా ఓ అవకాశం ఇవ్వమని కోరుదామన్నా, సవాలక్ష అడ్డంకులు సృష్టిస్తున్నారని పలువురు మదనపడుతున్నారు. 'బాబు ష్యూరిటీ...భవిష్యత్ గ్యారెంటీ'పేరుతో ఇంతకాలం కార్యక్రమాలు చేశాం. ఎన్ని మాటలు చెప్పి నా ప్రజల్లో ఆశించిన స్పందన లేదు. ప్రజల భవిష్యత్ ఏమోగానీ, మా భవిష్యత్‌కు క్లారిటీ లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

9న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికారసంస్థ వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్లు: 08562- 258622, 244622, ఈ- మెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్.ఈకోర్ట్స్.జీఓవి.ఐఎన్/కడప, డీఎల్ఎస్ఏకేడీపీఅట్‌ది రేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్‌లను సంప్రదించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ తెలిపారు.

రెచ్చిపోతున్న కేబుల్ దొంగలు!

- 160 బోర్ల కేబుల్ ఎత్తుకెళ్లిన దొంగలు
- నాలుగు నెలల వ్యవధిలోనే మూడుమార్లు చోరీలు
- నష్టపోతున్న రైతులు




సుబ్బిరెడ్డిగారిపల్లెలో దుండగులు వ్యవసాయబోరు వద్ద మోటారుకు అమర్చిన కేబుల్‌ను కత్తిరించుకొని వెళ్లిన దృశ్యాలు

గుర్రంకొండ : వ్యవసాయ బోర్లకు అమర్చిన కేబుళ్లను ఇష్టానుసారంగా దొంగలు చోరీ చేసి ఎత్తుకెళుతున్నారు. ఒకేసారి 12 గ్రామాల పరిధిలో 160 బోర్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు కత్తిరించుకుని వెళ్లారు. గత నాలుగు నెలల వ్యవధిలోనే మూడు మార్లు వ్యవసాయ బోర్ల వద్ద కేబుళ్లు చోరీకి గురికావడంతో రైతులు నష్టపోతున్నారు. ఒకసారి కేబుల్ అమర్చాలంటే ఒక రైతుకు రూ. 5 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చు వస్తుండడంతో లబోదిబో మంటున్నారు.

12 గ్రామాల పరిధిలో 160 బోర్ల కేబుల్ చోరీ

మండలంలోని గుర్రంకొండ, సరిమడుగు, చెర్లోపల్లె గ్రామాల పరిధిలో మొత్తం 160 బోర్లకు సంబంధించి కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. రాత్రిళ్లు కొంతమంది దొంగలు బృందాలుగా ఏర్పడి కేవలం మూడు రోజుల వ్యవధిలోనే వ్యవసాయ బోర్ల దగ్గర బోరుమోటార్లకు అమర్చిన కేబుల్‌ను కత్తిరించుకుని వెళ్లారు. రాత్రిళ్లు వ్యవసాయ బోర్ల దగ్గర రైతులు కాపలా ఉండరని తెలుసుకొన్న దొంగలు ఇష్టానుసారంగా కేబుళ్లను కత్తిరించుకొని పోతున్నారు. భారీ ఎత్తున బోర్ల కేబుళ్లు చోరీకి గురికావడం ఇటీవలి కాలంలో ఎన్నడూ జరగలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూడు మార్లు రూ.4 లక్షలు విలువచేసే కేబుల్ చోరీ

12 గ్రామాల పరిధిలోని 160 బోర్ల వద్ద దొంగలు గత నాలుగు నెలల్లో మూడుమార్లు రూ. 6లక్షలు విలువ చేసే కేబుళ్లను ఎత్తుకెళ్లారు. బోరు మోటారు నుంచి విద్యుత్ స్టార్టర్ వద్దకు సరాసరి మూడు నుంచి ఎనిమిది మీటర్ల మేరకు కేబుల్ వైర్లను రైతులు అమర్చి ఉంటారు. 160 బోర్లకు సంబంధించి సుమారు 3250 మీటర్ల మేర కేబుల్ చోరీకి గురైంది. మూడు మార్లుగా చోరీకి గురైన కేబుల్ విలువ మార్కెట్‌లో సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుంది. వీటితో పాటు వ్యవసాయబోర్ల వద్ద ఏర్పాటు చేసిన ఫీజు క్యారియర్లను కూడా దుండగులు ధ్వంసం చేసి అందులోని రాగి ప్లేట్లను ఎత్తుకెళుతున్నారు. వీటిని దొంగలు గుజిరీలు, బయట రాష్ట్రాలకు తరలించి తక్కువ ధరకే అక్కడ విక్రయిస్తున్నట్లు సమాచారం.

ఒకసారికి రైతుకు రూ.5వేలు ఖర్చు

దొంగలు చోరీచేసుకెళ్లిన కేబుల్ స్థానంలో కొత్త కేబుల్ అమర్చాలంటే ఒక రైతుకు రూ.5 వేలు నుంచి రూ 7వేలు వరకు ఖర్చు వస్తుంది. దొంగలు బోరుమోటారు వద్ద చివరి వరకు కేబుల్‌ను కత్తిరిస్తుంటారు. దీంతో కేబుల్ బోరులో పడిపోతుంది. సదరు కేబుల్‌ను బయటకు తీయాలంటే కచ్చితంగా బోరుమెకానిక్, బోరుమోటారు బయటకు తీసే వాహనం కచ్చితంగా పొలం వద్దకు రావాల్సి ఉంటుంది. కొత్తకేబుల్, మెకానిక్, వాహనం ఖర్చు లెక్కిస్తే ఒక రైతుకు సరాసరి ఒకసారికి రూ. 5 వేలకు పైనే ఖర్చువస్తుంది. నాలుగునెలలుగా సగటున ఒక రైతు రూ. 15 వేలు వరకు నష్టపోయాడు. 20 మీటర్ల కేబుల్ చోరీ చేసుకెళితే దొంగకు మిగిలేది రూ. 650, రైతుకు మాత్రం రూ. 7 వేల వరకు ఖర్చు వస్తుండడం గమనార్హం. దీంతో రైతులు కేబుల్ చోరీలతో బెంబేలెత్తిపోతున్నారు.

బయట రాష్ట్రాలు, గుజిరీలకు తరలిపోతున్న కేబుళ్లు

వ్యవసాయబోర్ల వద్ద దొంగలు కత్తిరించుకొని పోతున్న కేబుళ్లు గుజిరీలు, బయట రాష్ట్రాల్లోని మార్కెట్లకు తరలిపోతున్నాయి. రాత్రిళ్లు చోరీ చేసుకెళ్లిన కేబుళ్లను దొంగలు దూరంగా అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి రాత్రికి రాత్రే కాల్చి వేస్తారు. దీంతో కేబుల్‌కున్న రబ్బరు మొత్తం కాలిపోయి లోపల ఉన్న కాపర్, రాగివైర్లు బయట పడతాయి. వాటిని ముద్దలుగా చేసి సంచుల్లో నింపుతారు. 20 కేజీల కేబుల్‌ను కాల్చితే ఒక కిలో రాగి వస్తుంది. దీన్ని వారు గుజిరీలు లేదా పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని మార్కెట్లకు తరలించి విక్రయించేస్తుంటారు.

ఒకసారికి రూ.7 వేలుఖర్చు వస్తుంది



దొంగలు వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న కేబుల్‌ను కత్తిరించుకొని వెళితే మాకు రూ.7 వేలు ఖర్చు వస్తోంది. మార్కెట్లో మీటర్ బోరు కేబుల్ ధర రూ. 100 నుంచి రూ. 125 వరకు ధర పలుకుతోంది. 20మీటర్ల కేబుల్‌ను కొనుగోలు చేయాలంటే రూ. 2 వేలు నుంచి రూ.2500 వరకు ఖర్చుచేయాలి. మళ్లీ బోరు నుంచి పైపులు పైకి తీయాలంటే బోరు వాహనం రావాలి. మళ్లీ బోరు మెకానిక్ ఖర్చు మొత్తం కలుపుకొంటే రూ.7 వేలు వరకు ఒకసారికి ఖర్చు వస్తోంది. – రత్నమ్మ, మహిళా రైతు, కొత్తపల్లె

రెండు మార్లు చోరీ చేశారు



మా వ్యవసాయ పొలంలో దుండగులు రెండు మార్లు చోరీ చేశారు. ఒకమారు బోరు కేబుల్‌ను కత్తిరించుకొని వెళ్లారు. మరోసారి బోరు మోటారు పైకి తీసి పైపులు, బోరుకేబుల్ పొలం వద్ద ఉంచాము. మొత్తం 50 మీటర్ల మేరకు బోరు కేబుల్ చోరీ చేసుకెళ్లారు. వీటితో పాటు రాగిపేట్ల కోసం ఫ్యూజు క్యారియర్లు కూడా ధ్వంసం చేశారు. కేబుల్ చోరీలతో చాలా నష్టపోతున్నాము. ఒక్కోసారి సకాలంలో మెకానిక్‌లు అందుబాటులో లేకపోవడంతో పంటలు కూడా ఎండిపోతున్నాయి. – ఆనంద, రైతు, సుబ్బిరెడ్డిగారిపల్లె


కుక్కల దాడిలో పది పొట్టేళ్ల మృతి



మృతి చెందిన పొట్టేళ్ల వద్ద బాధిత రైతు నరసింహులు

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లె గ్రామానికి చెందిన గరుడప్పగారి నరసింహులు అనే రైతుకు చెందిన పది పొట్టేళ్లపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందాయి. బాధిత రైతు కథనం మేరకు... గురువారం రాత్రి పొట్టేళ్లను మేపుకొని పొట్టేళ్ల దొడ్డిలోకి వదిలాడు. అర్ధరాత్రి సమయంలో కుక్కల గుంపు పొట్టేళ్ల మందపై దాడి చేయడంతో పది పొట్టేళ్లు మృత్యువాతపడ్డాయి. వీటి విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుంది. ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సాయం అందజేయాలని ఆయన కోరాడు. కాగా, గ్రామంలో ఉన్న కుక్కల వల్ల ఇద్దరు కుక్కకాటుకు గురయ్యారని గ్రామస్తులు తెలిపారు.


ఖోఖోలో ప్రథమ స్థానంలో నిలిచిన పొత్తపి జట్టు



ఖోఖోలో ప్రథమ స్థానంలో నిలిచిన పొత్తపి క్రీడాకారులు

నందలూరు(రాజంపేట) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో నందలూరు మండలంలోని పొత్తపి గ్రామ సచివాలయ బాలుర జట్టు ఖోఖోలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఈ జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా రాష్ట్రప్రభుత్వం ఈ క్రీడలు నిర్వహిస్తోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



ప్రమాదంలో మృతి చెందిన వెంకటేష్

కలికిరి : రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి చెందిన సంఘటన మండలంలోని గుండ్లూరు గ్రామం బాటవారవడ్డిపల్లి వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఈతమానువడ్డిపల్లి సమీపం బాటవారవడ్డిపల్లికి చెందిన వెంకటేష్(65) శుక్రవారం రాత్రి తన ఇంటి ముందున్న చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిలో నడిచి వెళుతుండగా కేవీపల్లి మండలం తిమ్మాపురం వడ్డిపల్లికి చెందిన ఈశ్వర తన ద్విచక్రవాహనంతో పీలేరు వైపు నుంచి స్వగ్రామానికి వెళుతూ వెంకటేష్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఈశ్వరకు స్వల్ప గాయాలయ్యాయి. వెంకటేష్‌ను పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించిగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎన్జీఓ కాలనీలో తాను డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్న ఓ వాటర్ ప్యూరిఫైడ్ సంస్థ కార్యాలయంలోనే పామిడి బాలసుబ్బరాయుడు (29) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వూరు మండలం మదిరేపల్లి గ్రామానికి చెందిన పామిడి బాలసుబ్బరాయుడుకు, ఖాజీపేట మండలం కొత్తపేటకు చెందిన గాయత్రితో మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఏడాది కుమారుడు ఉన్నాడు. తన భార్య, కుమారుడు, కుటుంబ సభ్యులతో కడపలోని ముత్తరాసపల్లిలో నివాసం ఉంటూ ఎన్జీఓ కాలనీలో ప్యూరిఫైడ్ వాటర్ సంస్థ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పొద్దుపోయినా ఇంటికి రాలేదు. మరుసటి రోజు భార్య, స్థానికులు కార్యాలయం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయాడు. మృతదేహాన్ని కిందకు దించి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇటీవల తన భర్త కారులో వెళుతుండగా జేఎంజే కళాశాల వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొందని, ఈ ప్రమాదంలో ఎలాంటి గాయాలు తగలనప్పటికీ, ఆ రోడ్డు ప్రమాదాన్నే తలచుకుని తరచూ బాధపడేవాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మానసిక వేదనకు గురై తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్ నోట్ రాసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ మేరకు మృతదేహానికి శుక్రవారం రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌక్ పోలీసులు తెలిపారు.

దర్గా స్వామీజీ ఆరాధన మహోత్సవాలు



సద్గురు దర్గా స్వామిజీ, మాతాజీలకు పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

రామాపురం : రామాపురం మండలం నీలకంఠ్రావుపేట సమీపంలో వెలసిన శ్రీ దర్బారు సమర్థ సద్గురు దర్గా స్వామిజీ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం బెంగళూరుకు చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు గంగపూజ, కలశస్థాపన, పుణ్యావాచనం, రుద్రాభిషేకం, మహామంగళహారతి, సాయంత్రం గురుపూజ, విష్ణు సహస్రమార్చన, మంగళహారతి నిర్వహించారు. శనివారం ఉదయం 7గంటలకు కలశపూజ , సద్గురు పూజా, రుద్రాభిషేకం, గణపతి , నవగ్రహ రుద్ర, సద్గురు హోమాలు, మహా మంగళ హారతి, ప్రసాద వితరణం ఉంటుంది. సాయంత్రం పల్లకి మెరవణి ఉంటుంది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనలో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లి మండలం బసినికొండ పంచాయతీ నిమ్మనపల్లి రోడ్డు అంబేడ్కర్ కాలనీకి చెందిన వెంకటేష్ భార్య ఎం. సుశీల(24), భర్తతో గొడవ పడి మనస్థాపంతో శుక్రవారం పురుగు మందు తాగింది. అదేవిధంగా కొండయ్యగారిపల్లె పంచాయతీ దేవీరెడ్డి గారి పల్లెకు చెందిన షామీర్ బాషా భార్య పి.షాహీదా (26) కుటుంబ సమస్యల కారణంగా నిద్రమాత్రలు మింగింది. బి. కొత్తకోట మండలం గొల్లపల్లికి చెందిన వెంకట శివారెడ్డి కుమారుడు జయప్రకాష్ (20) ఫోన్ పే ద్వారా ఇతరులకు 20 వేల రూపాయలు నగదు చెల్లించడంపై తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపం చెందిన జయప్రకాష్ కురబలకోట మండలం అంగళ్ళు గోల్డెన్ వ్యాలీ స్కూల్ సమీపంలో పురుగుమందు తాగాడు. ఆయా ఘటనలు గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

నిమ్మనపల్లె : ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన నిమ్మనపల్లెలో జరిగింది. అగ్రహారం పంచాయతీ చింతపర్తివారిపల్లెకు చెందిన బండి వెంకటరమణ (80) ఇటీవల వ్యవసాయ పొలం వద్ద గాయపడి కాలికి తీవ్ర గాయమైంది. స్థానిక ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స కోసం శుక్రవారం సాయంత్రం ప్రాథమిక ఆసుపత్రికి కుమారుడు బండి నాగరాజతో కలసి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. తవళం రోడ్డులోని వినాయక మెకానిక్ షెడ్ వద్ద నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను డ్రైవర్ హఠాత్తుగా రోడ్డుపైకి మళ్లించడంతో ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో వృద్ధుడి కాలికి మరోసారి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో వృద్ధుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నిమ్మనపల్లి పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటాలి

ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రీడల విజేతలతో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో అన్నమయ్య జిల్లా జట్లు రాష్ట్ర స్థాయిలో కూడా సత్తా చాటి విజయ కేతనాన్ని ఎగురవేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ముగిశాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు జేసీ చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి జేసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా స్థాయి వరకు జరిగిన క్రీడా పోటీలలో యువకుల నుంచి వృద్ధుల వరకు పాల్గొని విజయవంతం చేయడం అభినందనీయం అన్నారు. ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ వంటి ఐదు రకాల పోటీల్లో పురుషులు, మహిళలుగా రెండు టీంల చొప్పున ఫైనల్ రాష్ట్ర స్థాయిలకు 10 టీంలు నిలిచాయి.

జిల్లా విజేతలు వీరే..

- వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో కోడూరు, ద్వితీయ స్థానంలో రాయచోటి, తృతీయ స్థానంలో పీలేరు
- మహిళల విభాగంలో... మొదటి స్థానంలో రాజంపేట, ద్వితీయ స్థానంలో (కలికిరి) పీలేరు, తృతీయ స్థానంలో (ములకలచెరువు) తంబళ్లపల్లి
- బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో కోడూరు, ద్వితీయ స్థానంలో రాయచోటి, తృతీయ స్థానంలో పీలేరు
- మహిళల విభాగంలో మొదటి స్థానంలో మదనపల్లి, ద్వితీయ స్థానంలో కోడూరు, తృతీయ స్థానంలో రాయచోటి

కబడ్డీ పోటీల్లో..

- పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో కోడూరు, ద్వితీయ స్థానంలో తంబళ్లపల్లి, తృతీయ స్థానంలో రాజంపేట
- మహిళల విభాగంలో మొదటి స్థానంలో మదనపల్లి, ద్వితీయ స్థానంలో కోడూరు, తృతీయ స్థానంలో రాజంపేట

ఖోఖో పోటీల్లో...

- పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో రాజంపేట, ద్వితీయ స్థానంలో రాయచోటి, తృతీయ స్థానంలో కోడూరు
- మహిళల విభాగంలో మొదటి స్థానంలో కోడూరు, ద్వితీయ స్థానంలో పీలేరు, తృతీయ స్థానంలో తంబళ్లపల్లి

క్రికెట్ పోటీల్లో...

- పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో పీలేరు, ద్వితీయ స్థానంలో రాజంపేట, తృతీయ స్థానంలో కోడూరు
- మహిళల విభాగంలో మొదటి స్థానంలో మదనపల్లి, ద్వితీయ స్థానంలో కోడూరు, తృతీయ స్థానంలో తంబళ్లపల్లి జట్లు నిలిచాయి. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటాయని ఆడుదాం ఆంధ్ర నిర్వాహకులు తెలిపారు.

నవశకం

సొంతింటి కల నెరవేరింది



మేము వ్యవసాయ కూలికి వెళుతూ జీవనం సాగిస్తున్నాము. కనీసం ఇల్లు కట్టుకునేందుకు స్థలం కూడా కొనలేని పరిస్థితి. బాడుగ ఇంట్లో ఉన్నాము. గతం ప్రభుత్వంలో చాలా సార్లు ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నాను. జన్మభూమి కమిటీ వారు నాకు ఇల్లు మంజూరు చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన వచ్చిన తరువాత ఆఫీసుల చుట్టూ తిరగకుండానే నాకు ఇంటి స్థలంతో పాటు, ఇల్లు కూడా మంజూరైంది. ఇప్పుడు నేను వంతాటిపల్లిలోని జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్నాను. జగన్ పుణ్యమా అని నాకు సొంతింటి కల నెరవేరింది. – షేక్ వాహిదా, వంతాటిపల్లి, సిద్దవటం మండలం

సీబీఎస్ఈతో నాలెడ్జ్ పెరుగుతుంది



ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశ పెట్టడంతో విద్యార్థుల్లో మంచి నాలెడ్జ్ పెరుగుతుంది. ముఖ్యంగా ఐఎఫ్‌బీ ప్యానల్ ద్వారా విద్యార్థులకు ఎలాంటి కంటెంట్ అయినా విజువల్ రూపంలో చూపించవచ్చు. పర్వతాలు, నదులు, కొండల గురించి సులభంగా వివరించొచ్చు. ఈ ప్యానల్స్ ద్వారా గూగుల్, యూ ట్యూబ్‌లో ఉండే కంటెంట్ వీడియోలు చూపిస్తే విద్యార్థులకు బాగా అర్థం అవుతుంది. ముఖ్యంగా బైజూస్ కంటెంట్ విద్యార్థులకు మరింత ఉపయోగపడుతుంది. నాడు-నేడు ద్వారా ఈ వసతులన్నీ మెరుగుపడ్డాయి. వాటిని ఉపయోగించడం వలన టీచింగ్ సులభంగా ఉండటంతో పాటు విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. – ఎంసీవీఎస్ రాజు, సోషల్ అసిస్టెంట్, జెడ్పీ బాయ్స్ హైస్కూల్, కమలాపురం

ఆటో బోల్తా

– ఐదుగురికి గాయాలు

మదనపల్లె : ఆటో బోల్తా పడి ఐదుగురు గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లి మండలంలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం యాపలపల్లెకు చెందిన ఆటో ప్రయాణికులతో బయలుదేరి మదనపల్లికి వస్తుండగా, మండలంలోని చీకిలబైలు పంచాయతీ బార్లపల్లి వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కర్ణాటకకు చెందిన టి.బాబు (54), శ్రీలక్ష్మి (75), సిద్దమ్మ(65), రెడ్డెప్ప(70), మధు(66) స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు గమనించి 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పాముకాటుతో మహిళ మృతి



లక్ష్మీదేవి (ఫైల్)

కేవీపల్లె : పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని దిగువగళ్ల తాండాలో చోటు చేసుకుంది. బి. వెంకట నాయక్ తన వ్యవసాయ పొలంలో వేరుశనగ సాగు చేశారు. గురువారం రాత్రి వెంకటనాయక్, ఆయన భార్య బి. లక్ష్మీదేవి (42) ఇద్దరూ కలసి పొలం వద్ద కాపలా ఉండేందుకు ఇంటి నుంచి వెళ్లారు. నడుచుకుంటూ వెళ్తుండగా దారిలో లక్ష్మీదేవి పాముకాటుకు గురైంది. ఆమెను చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.


రైలు కింద పడి యువకుడి మృతి



విష్ణువర్ధన్ (ఫైల్)

వాల్మీకిపురం : ఓ యువకుడు రైలు కింద పడి మృతి చెందిన సంఘటన పట్టణంలోని పునుగుపల్లి సమీపంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మదనపల్లి మండలం, బసినికొండ పంచాయతీ గంగన్నవారిపల్లికి చెందిన కనమన్న కుమారుడు విష్ణువర్ధన్ (26) వాల్మీకిపురం పట్టణం పునుగుపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడ సమీపంలోని రైల్వే లైన్ వద్ద శుక్రవారం ఉదయం రైలు కింద పడి మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

108లో ప్రసవం



బి.కొత్తకోట : ప్రసవం కోసం గర్భిణిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించిన ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. పెద్దతిప్పసముద్రం మండలం కమ్మచెరువుకు చెందిన భువనేశ్వరి రెండోసారి గర్భం దాల్చింది. పురిటినొప్పులు రావడంతో 108లో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించారు. ఇక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు మదనపల్లెకు సిఫార్సు చేశారు. ఆమెను 108లో తీసుకెళ్తుండగా సర్కారుతోపు వద్ద ఆమె ప్రసవించింది. ఆడ శిశువు జన్మించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో వారిని ఆస్పత్రికి తరలించారు.